తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

బుధవారం

18 నవంబర్ 2026

Follow :

సీఎం సభా ఏర్పాట్లను
పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట బ్యూరో నవంబర్ 17, (జనంసాక్షి): ఈ నెల 19వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో సభ ప్రాంగణాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. సిద్దిపేట బైపాస్ రోడ్డులోని నాగదేవత ఆలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని సందర్శించి, ఏర్పాట్ల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.


సభకు భారీ సంఖ్యలో ప్రజలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు.సభకు వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్, బారికేడింగ్, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు, జన సమీకరణ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సభా వేదిక నిర్మాణంతో పాటు ఇతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ నెల 19న సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే తొలిసారిగా, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు.

అదే రోజున మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు.ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత మూడేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు, భవిష్యత్తులో ప్రజల కోసం చేపట్టబోయే కార్యక్రమాలపై ముఖ్యమంత్రి సభా వేదిక నుంచి ప్రసంగించనున్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు

మిగతా 11లో..

ఇందిరమ్మ ఇళ్లే
బిల్లుల కోసం ఎదురుచూపులు



- అప్పు చేసి ఇంటి నిర్మాణం చేపట్టిన పేద కుటుంబం..
- బిల్లులు రాక నిలిచిన పనులు
- ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని బాధితుడి వేడుకోలు

కోహీర్, నవంబర్ 17 (జనంసాక్షి): పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం క్షేత్రస్థాయిలో కొందరు లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయం సకాలంలో అందకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోతున్నాయి.

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన దూదేకుల రిజ్వానా రఫీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసి పనులు ప్రారంభించారు. అప్పు చేసి తెచ్చిన డబ్బులతో బేస్‌మెంట్, లెంటల్ వరకు నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో డబ్బులు లేక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఇంటి నిర్మాణాన్ని కొనసాగించలేని పరిస్థితి నెలకొంది.

ప్రకటనలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు వ్యత్యాసం!

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకుని పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇంటి బిల్లులను వెంటనే విడుదల చేయాలని రిజ్వానా దూదేకుల రఫీ కోరుతున్నారు. అప్పులు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించిన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, నిలిచిపోయిన నిర్మాణ పనులు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



హామీల అమలేది.. కౌన్సిలర్లకు గౌరవం ఏదీ?

- అధికారుల తీరుపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనం సాక్షి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో ప్రతిపక్ష కౌన్సిలర్లకు అధికారులు కనీస గౌరవం, ప్రాధాన్యత ఇవ్వడం లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు మండిపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ శ్రీశైలం, నాయకుడు గంగాధర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

2వ వార్డు కౌన్సిలర్ తిమ్మాజిపేట పాండు మాట్లాడుతూ.. 100 రోజుల్లో కొత్త పింఛన్లు, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ అందించాలని, అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని, పట్టణంలో పశువైద్యశాల ఏర్పాటు చేయాలని కోరారు.


10వ వార్డు కౌన్సిలర్ జయప్రకాష్ నారాయణ చారి మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలను అధికార పార్టీ కార్యక్రమాలుగా నిర్వహిస్తూ ప్రతిపక్ష కౌన్సిలర్లను విస్మరిస్తున్నారని ఆరోపించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.40 కోట్లు, రోడ్లకు రూ.20 కోట్లు మంజూరైన పనుల వివరాలను వెల్లడించాలని, ప్రతి వార్డుకు రూ.కోటి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

12వ వార్డు కౌన్సిలర్ ముమ్మడి జయలక్ష్మి నగేష్ చారి మాట్లాడుతూ.. వార్డులో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం తనకు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురించి కూడా సమాచారం ఇవ్వలేదని, ఫోన్ నంబర్ లేదని వార్డు అధికారి చెప్పడం బాధాకరమన్నారు. మహిళా ప్రజాప్రతినిధిగా తనకు గౌరవం కల్పించాలని కోరారు.

ప్రతి ఇంటికి ఇందిరమ్మ భీమా: కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 17(జనంసాక్షి): ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేసేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఆదేశించారు. మంగళవారం ఇంది రమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గూగుల్ మీట్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికా రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ కార్డు ఉన్న వారికి లేని వారికి కూడా ఈ పథకానికి అర్హులని తెలిపారు. వార్డ్‌వైస్‌గా చేసి మున్సిపల్ కమిషనర్లు నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు లొకేషన్ పంపాలని తెలిపారు. తాగునీటి వసతి శ్యామ్యాన వేసి ప్రతి ఒక్కరికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దరఖాస్తులలో రేషన్ డీలర్ సహాయం తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ విజిట్ చేసి నివేదిక పంపాలన్నారు. తాసిల్దార్, ఎం.పి.డి.ఓ.లు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. పబ్లిక్ రిప్రజెంట్లను పిలవాలని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సీరియస్గా తీసుకొని పనిచే యాలని ఆదేశించారు. జీవిత బీమా చేసుకోవడం వల్ల రూ. 5 లక్షల బీమా ఉంటుందని తెలిపారు. కుటుంబాన్ని పోషించే 18 నుండి 59 వయసుగల యజమానికి వర్తిస్తుందని తెలిపారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19న ఈ పథకం ప్రారం భించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నా రు.



- యూఐడీఏఐ ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 17(జనంసాక్షి):
ప్రజలకు ఆధార్ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించాలనే

ప్రజలకు మరింత చేరువలో ఆధార్ సేవలు

లక్ష్యంతో ఏర్పాటు చేసిన యూఐడీఏఐ ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆధార్ కార్డు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సేవలు పొందేందుకు కీలకమైన గుర్తింపు పత్రంగా మారిందన్నారు. ఈ కేంద్రంలో ఆధార్ నమోదు, పేరు, చిరునామా, మొబైల్ నంబర్ తదితర వివరాల్లో మార్పులు, నవీకరణ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలందిస్తూ,



నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆధార్ సేవా కేంద్రంలోని సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం: మంత్రి వాకిటి శ్రీహరి

- అమరచింత మండలంలో 455 మందికి చేయూత పింఛన్లు
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





అమరచింత, నవంబర్ 17 (జనంసాక్షి): పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మస్తీపురం క్రాస్‌రోడ్ సమీపంలోని మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమరచింత మండలానికి కొత్తగా మంజూరైన 455 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాలు కోరిన వెంటనే బ్యాంకుల ద్వారా రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరవుతున్నాయని చెప్పారు.

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని, రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేదలకు రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా ఆరు కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. బీడీ, చేనేత, గీత కార్మికులతో పాటు కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు.

అమరచింత అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని, ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే మళ్లీ ఓట్లు అడుగుతానని మంత్రి స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా కొనసాగిస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో టాడీ టాపర్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశవ్ నాగరాజు, రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జింక సువర్ణ, వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఊర్కొండ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



ఊర్కొండ, నవంబర్ 17, (జనంసాక్షి); కేజీబీవీ ఊర్కొండ పాఠశాలను మండల విద్యాధికారి అబ్దుల్ రహీం సందర్శించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువులో మెరుగుదల కోసం ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కే.ఎస్. సురేష్ ఏకగ్రీవ ఎన్నిక



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి): ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నాగర్‌కర్నూల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కే.ఎస్. సురేష్ (జెమిని సురేష్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ నుంచి జాతీయ కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం లభించడం పట్ల జర్నలిస్టు వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తన ఎన్నికను వ్యక్తిగత గౌరవంగా కాకుండా జర్నలిస్టుల పట్ల మరింత బాధ్యతగా భావిస్తున్నానన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. వారి సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. తన ఎన్నికకు సహకరించిన టీయూడబ్ల్యూజే–హెచ్143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

చౌట్కూర్‌లో చేయూత పింఛన్ పత్రాలు అందజేసిన గ్రామ సర్పంచ్ పార్కుల రామ్ రెడ్డి



చౌట్కూర్ , నవంబర్ 17 (జనంసాక్షి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామంలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పార్కుల రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. అనంతరం కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ సమాజంలోని నిరుపేద, బలహీన వర్గాలకు ఆర్థికంగా అండగా నిలవడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ బి సుభాష్ రెడ్డి ఎంపీడీవో శంకర్ పంచాయతీ సెక్రెటరీ సందీప్ గౌడ్ మాజీ ఉపసర్పంచ్ కళాలి రామా గౌడ్ ఉప సర్పంచ్ దమ్మి నాగరాణి కృష్ణ వార్డు మెంబర్లు గోరేమియా జైపాల్ రెడ్డి కొజ్జా లక్ష్మయ్య ఏలియా నాయకులు కొలుకూరి మొగులయ్య మహేష్ చేయూత పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావిలో 364 మందికి ఆసరా పింఛన్లు: మంత్రి జూపల్లి

- మత్స్యకారులకు మూడు ద్విచక్ర వాహనాల పంపిణీ





చిన్నంబావి, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వృత్తిదారుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం చిన్నంబావి మండలంలో పర్యటించిన ఆయన పలు సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన 364 మంది లబ్ధిదారులకు ఆసరా (చేయూత) సామాజిక భద్రతా పింఛన్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కాలూర్ గ్రామానికి చెందిన మత్స్యకారులకు తెలంగాణ మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సబ్సిడీపై మంజూరైన మూడు ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. చేపల వేట అనంతరం వాటిని మార్కెట్లకు తరలించి విక్రయించడంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఈ వాహనాలు అందిస్తున్నట్లు వివరించారు. వీటి ద్వారా చేపల రవాణా సులభతరం కావడంతో పాటు సమయం, శ్రమ ఆదా అవుతాయని, త్వరగా మార్కెట్లకు చేరవేసి మెరుగైన ఆదాయం పొందవచ్చని అన్నారు.



మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచి, సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. పేదలకు సామాజిక భద్రత కల్పిస్తూ, వృత్తిదారుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పింఛన్ లబ్ధిదారులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తుక్కాపూర్‌లో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం



కొల్చారం, నవంబర్ 17 (జనంసాక్షి): కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నేడు మధ్యాహ్నం 12:30 గంటలకు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొల్చారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంపల్లి గౌరీ శంకర్ కోరారు.

నూతన తహసీల్దార్‌కు ఘన సన్మానం



చౌట్కూర్, నవంబర్ 17 (జనంసాక్షి): చౌట్కూర్ మండల నూతన తహసీల్దార్‌గా నియమితులైన విజయలక్ష్మిని గ్రామ సర్పంచ్ పార్కుల రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ, పాలనకు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

19 నుండి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తులు

- అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా
- మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, ఎంపీడీవో విజయకుమార్ వెల్లడి



జడ్చర్ల, నవంబర్ 17 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కింద జడ్చర్ల మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల్లో అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, ఎంపీడీవో విజయకుమార్ మంగళవారం తెలిపారు. నవంబర్ 19 నుండి అన్ని వార్డులు, గ్రామ పంచాయతీలలో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి (18–59 ఏళ్ల వయస్సు) మరణిస్తే రూ. 5 లక్షల ఆర్థిక భరోసా లభిస్తుంది.

కులం, మతం, ఆదాయ పరిమితులు లేకుండా వర్తించే ఈ పథకానికి ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. ఒకరి కంటే ఎక్కువ సంపాదించేవారు ఉంటే, ఎవరి పేరుపై బీమా చేయించాలో కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చు. ఒకరు లేదా పలువురిని నామినీలుగా పెట్టుకోవచ్చు (మైనర్లు అయితే సంరక్షకుడి వివరాలు తప్పనిసరి).

దరఖాస్తు కోసం కుటుంబ సభ్యులందరి ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్ లింక్ మొబైల్ నంబరు, ఇంటి నంబరు వివరాలు అందజేయాలి. నవంబర్ 19 నుండి పట్టణంలో వార్డు అధికారులను, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను కలిసి దరఖాస్తులు ఇవ్వాలని, వివరాలు చదివి వినిపించి సంతకం తీసుకున్న తర్వాతే ఆన్‌లైన్ చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు వారు తెలిపారు.

మక్తల్ మండలంలో రోడ్డు ప్రమాదం

- తప్పిన పెను ప్రమాదం

మక్తల్, నవంబర్ 17 (జనంసాక్షి): మక్తల్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం మక్తల్ పట్టణానికి చెందిన ఈడిగ నరసింహులు గౌడ్ (40) వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్, మక్తల్‌లో ఫోటో షాప్ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయన కుమారుడు నందికేశ్వర్ గౌడ్ కారులో (TS09ER-8149) జక్లేర్‌కు బయలుదేరారు.

మార్గమధ్యలో మక్తల్ పెద్ద చెరువు కట్ట సమీపంలోని ఈదమ్మ గుడి వద్దకు చేరుకోగానే, అకస్మాత్తుగా గొర్రెలు కారుకు అడ్డురావడంతో డ్రైవర్ కారును ఆపారు. అదే సమయంలో వెనుక నుండి వస్తున్న టిప్పర్ (KA03AB-2526) డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి ముందు ఆగి ఉన్న కారును బలంగా ఢీకొట్టాడు.

ఈ ప్రమాదంలో కారు ముందు, వెనుక భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ప్రమాద సమయంలో రోడ్డుపై ఉన్న గొర్రెల కాపరికి తలకు, శరీరానికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుమ్మడిదల అభివృద్ధికి రూ.4.29 కోట్లతో శ్రీకారం...

- ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 17 (జనంసాక్షి): మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం, దోమడుగు, వీరన్న గూడెం, బొంతపల్లి, గుమ్మడిదల వార్డుల్లో రూ. 4.29 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత నిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.



అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ దశరథ్, సంబంధిత వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయొద్దు...

- సంక్షేమ బోర్డు నిధులు కార్మికుల కోసమే ఖర్చు చేయాలి
- కార్మికులకు రూ.5 వేల పింఛను ఇవ్వాలి
- కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి): కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయొద్దనీ, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును పరిరక్షించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. రెహమాన్, కార్యదర్శి బి. వెంకట్రాజ్యం మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బోర్డు నిధులను అనవసర ఖర్చులకు వినియోగిస్తూ, సహజ మరణం, ప్రమాద మరణాల పరిహారాన్ని ప్రైవేటు బీమా సంస్థలకు అప్పగించడం ద్వారా కోట్లాది రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయని విమర్శించారు. జూలై 2026తో ప్రైవేటు బీమా సంస్థ ఒప్పంద గడువు ముగిసినప్పటికీ, అదే సంస్థ ద్వారా బీమా పరిహారాల ప్రక్రియ కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. బీమా బాధ్యతలను నేరుగా కార్మిక శాఖకే అప్పగించాలని డిమాండ్ చేశారు.



50 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.5 వేల పింఛను ఇవ్వాలని, సీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆరోగ్య పరీక్షలను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రమాద మరణ పరిహారాన్ని రూ.15 లక్షలకు, సహజ మరణ పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, వివాహ కానుక, ప్రసూతి కానుకలను రూ.లక్షకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓ.ఎం.శివశంకర్, అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి,సుందరి, విజయలక్ష్మి, గద్దల కావ్య, చంటి, శోభ, గొల్ల మల్లేశ్వరి, అరుణ, శ్రీలత, సంగీత, స్వరూప, లావణ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ లక్ష్యం: బండి నవిత వేణు యాదవ్



బెజ్జంకి, నవంబర్ 17 (జనంసాక్షి): పేద ప్రజల సంక్షేమం, ఆత్మగౌరవం, ఆర్థిక భరోసానే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని బెజ్జంకి గ్రామ రెండో వార్డు సభ్యురాలు బండి నవిత వేణు యాదవ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేయూత పథకం కింద 4.50 లక్షల మందికి నూతన పింఛన్లు మంజూరు చేయడం పేద కుటుంబాల్లో ఆనందం నింపిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీలేని రుణాలు, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయన్నారు. ఇటీవల మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలు అందజేయడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు.

అర్హులైన పేదలందరికీ

చేయూత పింఛన్లు అందించడమే లక్ష్యం

- కొండాపూర్ మండలానికి 683 పింఛన్లు మంజూరు



సంగారెడ్డి, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తొగర్‌పల్లి సర్పంచ్ దివ్యవాణి ప్రశాంత్ గౌడ్ తెలిపారు. కొండాపూర్ మండలానికి 683 పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. తొగర్‌పల్లి గ్రామంలో అర్హుల గుర్తింపు, దరఖాస్తుల ప్రక్రియలో సర్పంచ్ ప్రత్యేక చొరవ చూపారు. మంజూరైన పింఛన్ల పత్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, మాజీ సర్పంచ్ యు. ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, పింఛన్లు రాని అర్హులు నిరాశ చెందవద్దని తెలిపారు. పింఛన్ల మంజూరుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అలసంద

పంటకు లద్ది పురుగు ముప్పు

- రైతులకు ఏడీఏ నూతన్ కుమార్ సూచనలు



గుండుమల్, నవంబర్ 17(జనంసాక్షి): గుండుమల్ మండలంలోని భోగారం గ్రామంలో అలసంద (క్రొపి) పంటను వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్ కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉందని గుర్తించి, వేపనూనె పిచికారీ చేయడం ద్వారా ప్రారంభ దశలోనే పురుగుల ఉధృతిని తగ్గించి పంటను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. క్షేత్ర పరిశీలనలో పొగాకు లద్దెపురుగు (స్పోడాప్టరా లితుర) ఉనికిని గుర్తించారు. ఈ పురుగు ఆకులను తిని పంటకు నష్టం కలిగిస్తుందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎక్కువగా చురుకుగా ఉంటుందని వివరించారు. దీని నివారణకు విషపు ఎర తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరానికి 5 కిలోల వరి తవుడు, 500 గ్రాముల బెల్లం, 3 లీటర్ల నీరు, 500 గ్రాముల కార్బరిల్ 50 డబ్ల్యూపి తో విషపు ఎర తయారు చేసే విధానాన్ని వివరించారు. విషపు ఎర వినియోగంలో తప్పనిసరిగా భద్రతా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కె.తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట సభకు 5 వేల మందితో తరలివెళ్లాలి

- ఈ నెల 19న సీఎం సభను విజయవంతం చేయాలి
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి



నర్సాపూర్, నవంబర్ 17 (జనంసాక్షి): ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కుటుంబంలో సభ్యుడు మరణిస్తే ఆర్థిక భరోసాగా రూ.5 లక్షలు అందించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని సీఎం సిద్దిపేట సభలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వివరించనున్నారని చెప్పారు. సభకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి సుమారు 5వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆరోజు సాయంత్రం 4 గంటల్లోపు సిద్దిపేటకు చేరుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మతిస్థిమితం సరిగ్గా లేని వృద్ధుడు అదృశ్యం



కేటీ దొడ్డి, నవంబర్ 17 (జనంసాక్షి): మండల పరిధిలోని గంగన్-పల్లి గ్రామానికి చెందిన పెద్ద తాయప్ప అలియాస్ బుగ్గారెడ్డి (61) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నర్సప్ప కుమారుడైన పెద్ద తాయప్పకు గత ఏడాది కాలంగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఎక్కడికి పడితే అక్కడికి తిరుగుతుండేవాడు. ఈ క్రమంలోనే ఈ నెల 2వ తేదీన (02.11.2026) ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో కూడా ఇలాగే వెళ్లి మూడు, నాలుగు రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడని, అయితే ఈసారి ఎన్ని రోజులైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గ్రామంలో, చుట్టుపక్కల గ్రామాల్లో మరియు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు.

దీంతో అదృశ్యమైన పెద్ద తాయప్ప కుమారుడు శ్రీ మైలారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అందోల్ నియోజకవర్గంలోని 60 గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం: మంత్రి దామోదర్ రాజనర్సింహ

మునిపల్లి, నవంబర్ 17(జనంసాక్షి): అందోల్ నియోజకవర్గంలోని 60 గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మండల కేంద్రమైన మునిపల్లిలో పెన్షన్ల పంపిణీ అనంతరం మంత్రి మాట్లాడుతూ... మారుమూల గ్రామాలనే భావన లేకుండా ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు కంకోల్, సింగీతం ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర సమయాల్లో రోగులకు సత్వర వైద్యం అందించేందుకు వైద్యులు, అంబులెన్సులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.

బుదేరా మహిళా కళాశాలలో మౌలిక వసతులు....

బుదేరా మహిళ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ నిధులతో పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా కూడా కళాశాల అభివృద్ధికి అదనపు నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సింగూరు జలాశయ వెనుక ప్రాంతంలోని గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరిస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పర్యాటక రంగం, విడిది కేంద్రాల అభివృద్ధి ద్వారా స్థానికులకు, చిన్న వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని వివరించారు.



మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం....

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ క్యాంటీన్లు తదితర వ్యాపార రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. మహిళలు అభద్రతా భావాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం సాధనలో మహిళలు కీలక పాత్ర పోషించాలని, ప్రతి ఒక్కరూ తమ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సతీష్ కుమార్, సుధాకర్ రెడ్డి, రామ్ రెడ్డి పాండు, నరేందర్ గౌడ్, నారాయణ యాదవ్, రుద్ర కృష్ణ పాల్గొన్నారు.

డబ్బుల విషయంలో గొడవ..

కన్నతల్లిని హత్య చేసిన కొడుకు



పెద్దశంకరంపేట, నవంబర్ 17 (జనంసాక్షి): మండలంలోని శివాయపల్లి గ్రామంలో డబ్బుల విషయంలో జరిగిన కుటుంబ కలహం హత్యకు దారితీసింది. చిలకముక్కు పాపయ్య తన తల్లి పద్మమ్మను రోకలి బండతో తలపై కొట్టి హత్య చేశాడు. ఈ ఘటన నవంబర్ 16న సాయంత్రం చోటుచేసుకుంది. డబ్బుల సమస్యలకు తల్లే కారణమంటూ ఆగ్రహించిన పాపయ్య ఆమెపై దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి అక్క కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు అందిస్తాం: గడిల రాంరెడ్డి



సదాశివపేట, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి అన్నారు. మంగళవారం సదాశివపేట మండలం మద్దికుంట గ్రామంలో సర్పంచ్ దేవల సింగ్‌తో కలిసి పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు అనుమతి పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, పింఛన్లు అందిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పత్రికా రంగంలో జర్నలిస్టుల సేవలు అభినందనీయం: అస్మా అమిత్ రాజ్



కోహిర్, నవంబర్ 17 (జనంసాక్షి):

జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోహిర్‌కు చెందిన జర్నలిస్టులు ప్రవీణ్ కుమార్, అనిల్, మహేందర్‌లను మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్మా, టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ అమిత్ రాజ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల కృషి అభినందనీయమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిరంతరం సేవలందిస్తున్న జర్నలిస్టులను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి: ఎమ్మార్పీఎస్




నంగునూరు (జనంసాక్షి):

దళితులకు ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. నంగునూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, హామీల అమలుపై సమాధానం చెప్పిన తర్వాతే జిల్లాలో అడుగు పెట్టాలని అన్నారు.

అంబేద్కర్ అభయహస్తం కింద దళితులకు ఇస్తామన్న రూ. 12 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. హామీలపై స్పష్టత ఇవ్వకపోతే సీఎం పర్యటన సందర్భంగా సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమి గారి రాజేందర్, జిల్లా కార్యదర్శి లింగాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు రేషన్ డీలర్ల వినతి



మెదక్, నవంబర్ 17 (జనంసాక్షి):

మంగళవారం రోజున హవేలీ ఘనపూరు మండల కేంద్రంలో డీలర్లు రేషన్ డీలర్లకు రూ.5000 గౌరవ వేతనంతో పాటు రూ.300 కమిషన్ పెంచాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కోరింది. రాష్ట్రంలో 17,200 మంది రేషన్ డీలర్లు ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు మేనిఫెస్టోలో రూ.5000 గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు రూ.300 కమిషన్ పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందని సంఘం నాయకులు గుర్తు చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలుపరిచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి రూ.5000 గౌరవ వేతనం, రూ.300 కమిషన్ పెంపునకు సహకరించాలని శాసనసభ్యులకు వినతి పత్రం అందజేశారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే కార్డుదారులను ఈ ఎలినే కరువు సమయంలో ఆదుకోవడం కోసం మరిన్ని నిత్యావసరాలు ఇప్పించాలని, రేషన్ డీలర్లు కమిషన్‌తో ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుండి విముక్తి కలిగించాలని కోరారు.ప్రభుత్వంతో మాట్లాడి డీలర్ల న్యాయబద్ధమైన కోరికలను తీర్చడంలో బాధ్యత తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. సుధాకర్ మెదక్ టౌన్ అధ్యక్షుడు అజీమ్ మెదక్ రూరల్ అధ్యక్షుడు బిక్షపతి డీలర్ లు కృష్ణమూర్తి నవీన్ సాయిలు రవీందర్ రెడ్డి యాదగౌడ్ సిద్దా గౌడ్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

యనగండ్లకు నూతన పీఏసీఎస్ మంజూరు...



కొల్చారం, నవంబర్ 17 (జనంసాక్షి): నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి చేస్తున్న కృషితో కొల్చారం మండలంలోని యనగండ్ల గ్రామానికి నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) మంజూరైందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ తెలిపారు. ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక చొరవతో పీఏసీఎస్ ఏర్పాటుకు ప్రభుత్వం సోమవారం అధికారిక ప్రకటన విడుదల చేసిందన్నారు. ఈ నిర్ణయంతో యనగండ్లతో పాటు పరిసర గ్రామాల రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతుల అవసరాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆవుల రాజిరెడ్డికి యనగండ్ల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మురళి, సింగిల్ విండో డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, డీలర్ బాలరాజ్, సభ్యుడు మన్నె కిష్టయ్య, నాయకులు రమేష్, కిష్టయ్యతో పాటు గ్రామ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పల వెంకటేష్ సహకారంతో క్రికెట్ టోర్నీ ప్రారంభం



కల్వకుర్తి, నవంబర్ 17 (జనంసాక్షి): బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా కల్వకుర్తిలో ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్ఎఫ్ఎల్-1 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఉప్పల వెంకటేష్ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే టోర్నీ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బావండ్ల మధు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, యువజన విభాగం అధ్యక్షుడు వట్టేపు కిషోర్, నిర్వాహకులు నరేష్, నాగేష్, అనిల్, ఫౌండేషన్ సభ్యులు అశ్విన్, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి అండర్ 14 బాలుర క్రికెట్ ఎంపికలు



నారాయణపేట, నవంబర్ 17(జనంసాక్షి):

70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడి యంలో జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలు జిల్లా డివైఎస్ఓ, ఎస్‌జిఎఫ్ వెంకటేష్ శెట్టి, శ్రీనివాస రెడ్డిపాల్గొని ప్రారంభించారు.ఈ సంద ర్భంగా వీరు మాట్లాడుతూ క్రికెట్ కోసం రోజు శ్రమిస్తే శారీరకంగా దృడంగా ఉండ టమే కాకుండా అన్నింటిలో చురుకుగా ఉంటారని, జిల్లాలోని క్రీడాకారులు బాగా రాణించి రాష్ట్ర జాతీయస్థాయిలో పాల్గొని జిల్లాకు మంచిపేరు తీసుకుని రావాలని కోరారు. ఈ సందర్భంగా అండర్ 14 క్రికెట్ నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారు వనపర్తిలో జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో నారాయణపేట జిల్లా తరుపున పాల్గొంటా రని ఎస్ జి ఎఫ్ నారాయ ణపేట జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో రిటైర్ ఏ ఈ లక్ష్మి గారు వ్యాయమ ఉపాధ్యాయులు రమణ,సాయినాథ్,బొలాలి, రవికుమార్ రామకృష్ణ రెడ్డి,కోచిలు, అజయ్, సురేష్, కార్తీక్ లు పాల్గొ న్నారు.

మృతుడి కుటుంబానికి
పద్మాదేవేందర్ రెడ్డి ఆర్థికసాయం



మెదక్, నవంబర్ 17 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హవేలి ఘనపూర్ మండలం రాజీపేటకు చెందిన పైతర నవీన్ కుటుంబానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అండగా నిలిచారు. నవీన్ మృతిపై కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందించారు. స్థానిక నాయకుడు సాయగౌడ్ ద్వారా ఈ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాకోబు, వార్డు సభ్యుడు స్వామి, నాయకులు ఆంజనేయులు, పాండురంగారావు, కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై అత్యాచార ఆరోపణలు..

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



బెజ్జంకి, నవంబర్ 17 (జనంసాక్షి): సిద్దిపేట ప్రభుత్వ వెటర్నరీ కళాశాలలో విద్యార్థినిపై ప్రిన్సిపాల్ అత్యాచారానికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ బెజ్జంకి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బోష ప్రజ్వేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థినులకు రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని, అన్ని ప్రభుత్వ కళాశాలల్లో మహిళా విద్యార్థినులకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్, సాయి శివ, చరణ్ తేజ్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు విడతల్లో
104 మంది యువతకు ఉద్యోగాలు

- నిరుద్యోగ యువతకు అండగా ఐక్యత ఫౌండేషన్



కల్వకుర్తి, నవంబర్ 17(జనంసాక్షి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన ఉద్యోగ కల్పన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇప్పటివరకు 104 మంది యువతకు ఉద్యోగాలు లభించాయి. అక్టోబర్ 13న ఆమనగల్‌లో నిర్వహించిన 25వ ఉద్యోగ ఎంపిక శిబిరానికి కల్వకుర్తి నియోజకవర్గం లోని వివిధ మండలాల నుంచి 347 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగాల కోసం నిర్వహించిన ప్రాథమిక ఎంపికలో 248 మంది అర్హత సాధించారు. అనంతరం ఐదు విడతల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించి 104 మందికి ఉద్యోగాలు ఖరారు చేశారు. అక్టోబర్ 16న 25 మంది, 22న 31 మంది, 23న 8 మంది, 30న 13 మంది, నవంబర్ 16న 27 మంది ఎంపికయ్యారు. తాజా విడతలో ఆమనగల్ నుంచి ఆరుగురు, కల్వకుర్తి నుంచి ఎనిమిది మంది, వెల్దండ నుంచి ఐదుగురు, తలకొండపల్లి నుంచి ఐదుగురు, మాడ్గుల నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఎంపికైన యువతకు రాఘవేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మహేష్, సభ్యుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పింఛన్లతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా: మంత్రి దామోదర్ రాజనర్సింహ

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- ప్రజలకు సేవ చేయడమే నా రాజకీయ ప్రస్థానం





మునిపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మునిపల్లి, రాయికోడ్ మండలాలకు చెందిన 1,213 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి నూతన పింఛన్ల మంజూరు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలకు సేవ చేయడమే తన రాజకీయ ప్రస్థానంలో ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు నాణ్యమైన వైద్యం, విద్యతో పాటు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులకు చేయూత పింఛన్లు అందించడం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. పింఛన్లు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, పేదలకు ఆత్మవిశ్వాసం, భరోసా కల్పించే సామాజిక భద్రత అని మంత్రి పేర్కొన్నారు. నూతనంగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది.



జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన చివరి లబ్ధిదారునికి చేరేలా చూడటమే అధికారుల లక్ష్యమన్నారు. పింఛన్ అనేది కేవలం డబ్బు మాత్రమే కాదని, దానితో లబ్ధిదారులకు ఆత్మవిశ్వాసం, భద్రత కలుగుతాయని పేర్కొన్నారు. మునిపల్లి మండలంలో 629 మందికి, రాయికోడ్ మండలంలో 584 మందికి కలిపి మొత్తం 1,213 మందికి నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 18,591 నూతన పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సూర్యారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిపల్లి సర్పంచ్ సౌందర్య నరేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పాండు నరేందర్ గౌడ్,మహిళా సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవి నీటి ఎద్దడిపై ప్రజలకు అధికారుల అవగాహన



గుమ్మడిదల, నవంబర్ 17 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు గుమ్మడిదల మండలం అనంతారం గ్రామంలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో, ఎంపీవో, ఏఈఈ, మిషన్ భగీరథ ప్రతినిధులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి నీటి కొరత, తాగునీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రతిఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడాలి



అమీన్‌పూర్, నవంబర్ 17, (జనంసాక్షి): విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ పుష్ప పేర్కొన్నారు. మంగళవారం రామచంద్రపురం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బీరంగూడ గుట్టపై వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅథిగా విచ్చేసిన ఆమె విశ్రాంత ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులందరూ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుని ఉదయం నుంచి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు రామ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదవి విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన పదవి విరమణ లాభాలను అందించడం లేదన్నారు. దాంతో అనేకమంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు మానయ్య, రాములు, ప్రవీణ, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌యాదవ్, కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ తదితరులున్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ టిప్పర్ డ్రైవర్‌కు జరిమానా



ఆత్మకూర్, నవంబర్ 17(జనంసాక్షి): ఆత్మకూర్ చెరువు కట్ట సమీపంలోని వై జంక్షన్ రోడ్డు వద్ద పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న టిప్పర్ డ్రైవర్ పట్టుబడ్డాడని ఎస్సై వి.జయన్న తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిణి ప్రసాద్ సాకేత్ అనే వ్యక్తి మద్యం సేవించి టిప్పర్ వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతన్ని ఆత్మకూర్ కోర్టులో హాజరుపరచగా, గౌరవ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మహమ్మద్ ముక్తియార్ గారు రూ. 3000/- జరిమానా విధించారు.కావున వాహనదారులందరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, నిబంధనలు పాటించాలని ఎస్సై జయన్న సూచించారు.

శారీరక వైకల్యమే తప్ప..
మానసికంగా దృఢంగా ఉండాలి

- నర్సాపూర్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



నర్సాపూర్, నవంబర్ 17 (జనంసాక్షి): మండల కేంద్రంలోని వికలాంగుల పునరావాస కేంద్రంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గాలి సుమలత అధ్యక్షతన బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ సేవలను గుర్తుచేశారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, శారీరక వైకల్యమే తప్ప మానసికంగా దృఢంగా ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు. అర్హులైన వారికి బస్సు పాసులు, ఆధార్ కార్డులు మంజూరు చేయాలని, స్వయం సహాయక సంఘాల్లో లేని దివ్యాంగులతో ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, సీసీలు పాల్గొన్నారు.

పేదలకు సీఎం
రిలీఫ్ ఫండ్ వరం: పత్యా నాయక్



వెల్దండ, నవంబర్ 17 (జనంసాక్షి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా నిలుస్తోందని గానుగట్టు తండా మాజీ సర్పంచ్ పత్యా నాయక్ అన్నారు. వెల్దండ మండలం గానుగట్టు తండాకు చెందిన శంకర్ నాయక్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన రూ.60 వేల విలువైన చెక్కును మాజీ సర్పంచ్ పత్యా నాయక్ బాధితుడికి అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై సంగారెడ్డిలో జర్నలిస్టుల అవగాహన ర్యాలీ

- నీరు, విద్యుత్తు పొదుపుతోనే భవిష్యత్తుకు భరోసా
- ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావాలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడి, ఉష్ణోగ్రతల పెరుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి నాయకత్వంలో చేపట్టిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్థానిక ఐబీ వద్ద ప్లకార్డులు ప్రదర్శించి ప్రారంభించారు. ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ర్యాలీలో జర్నలిస్టులు, విద్యార్థులు, వివిధ రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నీరు, విద్యుత్తు పొదుపుపై నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు వార్తల ప్రచురణకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో ప్రజల్లో చైతన్యం కల్పించడం అభినందనీయమన్నారు. ఎల్‌నినో ప్రభావాలపై గ్రామాలు, మండలాల్లోనూ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ విద్యుత్తును వృథా చేయకుండా ఆదా చేయాలన్నారు.



జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, నీటి కొరత ఏర్పడే అవకాశముందని తెలిపారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా, విద్యుత్తు ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని, అవసరం లేనప్పుడు విద్యుత్తు పరికరాలను నిలిపి వేయాలని పిలుపునిచ్చారు.



యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కె. ఫైజల్ మాట్లాడుతూ.. టీయూడబ్ల్యూజే-ఐజేయూ సామాజిక బాధ్యతలో భాగంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. టీజేఓ సంఘం జిల్లా అధ్యక్షుడు వైద్య నాథ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాలను సమిష్టిగా ఎదుర్కోవాలని, రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీపీఆర్వో విజయలక్ష్మి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్, రాష్ట్ర నాయకుడు బాసిత్, ఉపాధ్యక్షులు, వివిధ ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు, జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం చేతుల మీదుగా చేయూత పింఛన్ల పత్రాల పంపిణీ



కోహెడ, నవంబర్ 17 (జనంసాక్షి): మండల కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన చేయూత నూతన పింఛన్ల మంజూరు కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన 15 మంది అర్హులకు పింఛన్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాకల స్వర్ణలత-సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భరోసా కల్పించేలా పింఛన్ల మంజూరు చేసిన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో మహిపాల్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల, ఉపసర్పంచ్ రాగుల మహేష్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో ధన్వాడ వాసికి ప్రథమ బహుమతి



నారాయణపేట, నవంబర్ 17 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా ధన్వాడ గ్రామానికి చెందిన దండిగి అనురాధ కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించారు. కాశీలోని కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో సోమవారం 'కాశీ విశ్వేశ్వరునికి నిత్యాంజలి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక నృత్య ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. తన సొంత సంస్థ శ్రీ సాయిశ్వర్ ఆర్ట్స్ అకాడమీ తరఫున ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శాస్త్రీయ నృత్య కళాకారిణులతో పోటీపడి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఆమె ప్రతిభ, సాధన పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు...

- మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేత సత్య యాదవ్



నారాయణపేట, నవంబర్ 17(జనంసాక్షి): ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు అని నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్య యాదవ్ అధికారులకుసూచించారు.

మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అన్ని శాఖల పనితీరుపై సమీక్ష - ప్రతి విభాగాన్ని స్వయంగా ఆమె పరిశీలించారు. ప్రతి విభాగాన్ని స్వయంగా సందర్శించి, ఆయా శాఖల పనితీరు, జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ప్రాధా న్యతతో స్వీకరించి, సాధ్య మైనంత త్వరగా పరిష్కరిం చాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరి తగతిన పరిష్కరించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరు గైన మున్సిపల్ సేవలు అందించాలని సూచించా రు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మేనేజర్, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ సాబ్.. కొంచెం దూకుడు పెంచండి!



రాజోలి, నవంబర్ 17 (జనంసాక్షి): మండల కేంద్రమైన రాజోలిలో మనిషి చివరి ప్రయాణాన్ని గౌరవంగా సాగనం పాల్సిన వైకుంఠధామం నిర్వహణ లోపంతో అధ్వానంగా మారింది. శ్మశాన వాటికలో ఎక్కడ చూసినా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో అంత్యక్రియలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైకుంఠధామం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, నిర్వహణపై పర్యవేక్షణ కొరవడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా సర్పంచ్ సాబ్ స్పందించి కొంచెం దూకుడు పెంచాలని, వెంటనే ముళ్లపొదలు తొలగించి, పిచ్చిమొక్కలు శుభ్రం చేయించి వైకుంఠధామానికి పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. చివరి మజిలీలోనైనా మనిషికి గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గద్వాలలో 925 మందికి కొత్త చేయూత పింఛన్లు

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి





గద్వాల, నవంబర్ 17 (జనంసాక్షి): గద్వాల పట్టణంలోని 925 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని తెలిపారు. ఏళ్ల తరబడి పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం ద్వారా వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా పేదలకు చేరాలన్నదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు. గద్వాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో నిరంతరం కృషి చేస్తానని, మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి గద్వాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కొత్త పింఛన్లు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పింఛన్ల మంజూరుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా నాయకులు గద్దం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన



మల్దకల్, నవంబర్ 17 (జనంసాక్షి): జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా సూచనలు సలహాల మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో మంగళవారంజోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూరు గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగ కళాకారులు తమ ఆటపాట మాటలతో ప్రజలను చైతన్యపరిచారు.

రైతులు ఆరుతడి పంటలు వేయాలని, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ప్రతి ఒక్క ఇంటిదగ్గర ఇంకుడు గుంతలు ఉండాలని దీనివల్ల భూగర్భజాలాలు పెరుగుతాయని, జల సంరక్షణకై గ్రామస్తులు తోడ్పడాలని, విద్యుత్ను ఆదా చేయాలని, మూగజీవులకు నీటితోటి లను గ్రామ పరిసర ప్రాంతాల్లో పొలాల దగ్గర నిర్మించాలని రైతులకు అధికారులకు సూచించారు.ప్రతి ఒక్కరూ ప్రతి నీటి బొట్టును ఒడిసిపటాలని వారికి తమ ఆటపాట మాటలతో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వినోద్,ఉపసర్పంచ్,వార్డు మెంబర్లు రైతులు గ్రామ పెద్దలు మహిళలు వృద్ధులు తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సారథి ఉద్యోగులు మొహమ్మద్ హజరత్,రాహుల్,కేశవులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఏదుల పీఈటీ వి. రాజేందర్ ఎంపిక

- గోవాలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పోటీల్లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం



రేవల్లి, నవంబర్ 18 (జనంసాక్షి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి ఫుట్ బాల్ క్రీడా పోటీలకు ఏదుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి. రాజేందర్ ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా నివాసి అయిన రాజేం దర్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఇదే మొట్ట మొదటిసారి. ఈ క్రీడా పోటీలు గోవాలో ఈ నెల 18 నుండి 24 వరకు జరగనున్నాయి.ఈ పోటీల్లో ఆయన తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. రాజేందర్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఈఓ యాదయ్య, డీవైఎస్ఓ సుధీర్ రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ బి.కుమార్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సురేందర్ రెడ్డి, జెడ్పీహెచ్ఎస్ ఏదుల పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, స్కూల్ చైర్మన్ గౌతమి, ఏదుల సర్పంచ్ పరశురామ్ యాదవ్, ఉప సర్పంచ్ శేషు రెడ్డి, సీనియర్ ప్లేయర్స్ మంజుల, రమేష్, స్వేరో, గ్రామ పెద్దలు, గ్రామ యూత్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నూతన పింఛన్ మంజురూ పత్రాలు అందించిన మంత్రి దామోదర

రాయికోడు, నవంబర్ 17 (జనంసాక్షి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 587 మంది లబ్ధిదారులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా మంగళవారం నూతన పింఛన్ పత్రాలను పంపిణీ చేశారు.మండల కేంద్రమైన మునిపల్లి ఎస్ఆర్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య,డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్ పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారు లకు మంజూరు పత్రాలను అందించారు. రైకోడ్ మండ లం నుండి నూతన పింఛన్ల పంపిణీ పంపిణీ కార్యక్రమా నికి ఆయా గ్రామాల లబ్ధిదారులు భారీగా తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్,మాజీ వైస్ చైర్మన్ మహంకాళి,మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజు పాటిల్, బాలాజీ నర్సింలు,



వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి,మాజీ అధ్య క్షులు ఏ.ప్రభాకర్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబా గౌడ్, ఉపాధ్యక్షులు ఎండి రఫీక్,సీనియర్ నాయకులు సుభాస్ పటేల్, మహమ్మద్ సుల్తాన్, ఆర్ రాజ్ కుమార్, బాసిత్ పటేల్,యాదన్న, కపిల్, లక్ష్మణ్, జి విట్టల్,నజీర్, ఎండి మక్సుద్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఒగ్గు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీడీవో ఎంఎ షరీఫ్, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శిలు, నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.

పేదల కళ్లలో ఆనందమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే రోహిత్ రావు

హవేలీ ఘన్పూర్‌లో 618 మందికి చేయూత పింఛన్ల పంపిణీ

మెదక్, నవంబర్ 17 (జనంసాక్షి): పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభు త్వం చేయూత పింఛన్ల కార్యక్రమా న్ని పటిష్టంగా అమలు చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరైన 618 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కళ్లలో ఆనందం చూడాలనే ఉద్దేశంతోనే ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నా



రు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పింఛన్లు కేవలం ఆర్థిక సహాయమే కాకుండా నిరుపేద కుటుంబాలు ఆత్మ గౌరవంతో జీవించేందుకు తోడ్పడే భరోసా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రేయంత్ మండల పార్టీ అధ్యక్షుడు గుండారం కిరణ్ గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, మాజీ అధ్యక్షుడు లక్కరి శ్రీనివాస్, మండల నాయకులు బాలకిషన్ రావు, శేరి మహేందర్ రెడ్డి, నోముల శ్రీకాంత్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, అధికారులు, లబ్ధి దారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ యాదగిరి రెడ్డి

కొండపాక, నవంబర్ 17 (జనంసాక్షి):
కుక్కునూరుపల్లి మండలం లకడారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అనబోయిన నర్సింలు మృతి చెందగా ఈరోజు వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈయన నర్సింలు మృతి గ్రామ పార్టీకి తీరనిలోటు ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రతాప్ రెడ్డి 5000 రూపాయలు మరియు రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ 10000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిల్పా నర్సింలు,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోడిత్యాల సంతోష్,గ్రామ వార్డ్ మెంబర్స్ కళా కరుణాకర్ లావణ్, భిక్షపతి, చిరుబోయిన సాయిలు, గట్టు చంద్రం, వంకని రాజు, బిఆర్ఎస్ నాయకులు మైనుద్దీన్ నవాబ్ ముక్కని రాజు యాదగిరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

మక్తల్, నవంబర్ 17 (జనంసాక్షి):



మక్తల్ మండలం ముష్టిపల్లి గ్రామ శివారులో విద్యుత్ షాక్ తగిలి దడుగుల రాజు (కూలీ) మృతి చెందాడు. ఎస్ఐ పి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా పెబ్బేరు మండలం కంచిరావు పల్లికి చెందిన రాజు రాళ్లు కొట్టే పని కోసం ముష్టిపల్లికి వచ్చాడు. గ్రామానికి చెందిన రవి, ప్రశాంత్‌లతో కలిసి బెల్లం శ్రీనివాస్‌రెడ్డి పొలంలో పని చేస్తుండగా, తాగునీటి కోసం సమీపంలోని బోరు వద్దకు వెళ్లాడు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

నూతన వైస్ చైర్మన్‌కు ఘన సత్కారం



పెద్దకొత్తపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి): కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పసుపుల నర్సింహను మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడు ఆధ్వర్యంలో ఆత్మీయులు, నాయకులు శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నర్సింహ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గువ్వల కురుమయ్య, మధు యాదవ్, సాయిరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా!

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి ఁ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే రూ.5 లక్షల ఆర్థిక సాయం
- లబ్ధిదారులపై ప్రీమియం భారం లేకుండా ప్రభుత్వమే చెల్లింపు
- నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నమోదు ప్రక్రియ ప్రారంభం



కోహీర్, నవంబర్ 17 (జనంసాక్షి): రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. కుటుంబ పెద్ద అకాల మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఈ పథకం ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నారు. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ పథకం 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల కుటుంబ పెద్దకు వర్తిస్తుంది. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా చెల్లించనుండటంతో లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదు.

నవంబర్ 19 నుంచి నమోదు ప్రక్రియ...

'ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం' నినాదంతో నవంబర్ 19, 2026న సిద్దిపేటలో పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అదే రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల వివరాల నమోదు చేపట్టనున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో కుటుంబాల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

ఆదాయ, కుల, మత భేదాలు లేకుండా అర్హత

తెలంగాణ రాష్ట్ర శాశ్వత నివాసులైన అర్హ కుటుంబాలకు ఆదాయ, కుల, మత భేదాలు లేకుండా నిర్దేశిత నిబంధనల ప్రకారం పథకం వర్తించనుంది. కుటుంబ సభ్యుల అంగీకారంతో బీమాదారుడిని, నామినీని ఎంపిక చేసుకోవచ్చు. నమోదు సమయంలో జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం, ఇంటి నంబరు, రేషన్ కార్డు వివరాలతో పాటు బీమాదారుడి పేరు, పుట్టిన తేదీ, ఆధార్, మొబైల్ నంబరు, కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తారు. నామినీ పేరు, బీమా మొత్తంలో వాటా శాతం నమోదు చేయాలి. నామినీ మైనర్ అయితే సంరక్షకుడి వివరాలు సమర్పించాలి.

కుటుంబాలకు ఆర్థిక భరోసా...

కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో పిల్లల చదువులు, కుటుంబ అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్ సూచించారు.

స్వగ్రామంపై మమకారం.. అధికారులపై అభిమానం

- గండీడ్ తహసీల్దార్‌కు హర్షవర్ధన్ ఘన సన్మానం



గండీడ్, నవంబర్ 17(జనంసాక్షి): స్వగ్రామంపై చెరగని మమకారం.. సొంత ప్రాంతంలోని అధికారుల పట్ల ప్రత్యేక అభిమానం చాటుకుంటూ అశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన, హర్షవర్ధన్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అస్సాం రాష్ట్రంలో 'హైదరాబాద్ కిచెన్' పేరుతో హోటల్ నిర్వహిస్తూ వ్యాపార రంగంలో రాణిస్తున్న ఆయన స్వగ్రామానికి విచ్చేసిన సందర్భంగా, మంగళవారం గండీడ్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అస్సాం రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన కామాఖ్య దేవాలయం నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన అమ్మవారి పాదుకలను తహసీల్దార్‌కు అందజేశారు. అనంతరం శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఆత్మీయంగా సన్మానించారు. స్వగ్రామానికి దూరంగా ఇతర రాష్ట్రంలో స్థిరపడి వ్యాపారంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నప్పటికీ, పుట్టిన ఊరితో అనుబంధాన్ని మరువకుండా, స్వగ్రామంలోని అధికారుల పట్ల గౌరవాభిమానాలు ప్రదర్శించడం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ హర్ష వర్ధన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపాల్, వెంకటయ్య, చంద్రయ్య, ఆంజనేయులు, హనుమంతు పాల్గొన్నారు.

ప్రేమ, పెళ్లి వేధింపులు తాళలేక బాలిక మృతి

- ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలింపు



చిన్నంబావి, నవంబర్ 17 (జనంసాక్షి): ప్రేమ పేరుతో వేధింపులు, పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకుంది. చిన్నంబావి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో వేధింపులకు గురిచేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. ఈ ఘటనపై చిన్నంబావి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రత్నం వివరాలు వెల్లడించారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బీఎన్ఎస్ 107, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. దీని వెనకాల ఇంకా ఎవరైనా ఉన్నారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది అని తెలిపారు.

ఆపదలో పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

పెద్దకొత్తపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి):



అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని నాయకులు తెలిపారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో మంజూరైన రూ.87 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. బుసిగారి రవికి రూ.34 వేలు, పట్నం శంకరయ్యకు రూ.18 వేలు, మదుగాని మౌనికకు రూ.35 వేల చొప్పున అందజేశారు. ఆర్థిక సాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని లబ్ధిదారులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గువ్వల కురుమయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే రోహిత్ రావు

మెదక్ నియోజకవర్గంలో 4,034 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు



మెదక్, నవంబర్ 17 (జనంసాక్షి): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు.
మంగళవారం మెదక్ నియోజకవర్గ పరిధిలో కొత్తగా చేయూత పింఛన్లకు అర్హత సాధించిన లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 4,034 మంది నూతన పింఛన్లకు అర్హత సాధించారని తెలిపారు. వీరికి ప్రతినెలా రూ.96,02,544 పింఛన్ల రూపంలో అందనున్నట్లు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. చేయూత పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా అర్హులకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.



మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు:
హవేలీఘనపూర్ - 618 మంది
మెదక్ మండలం - 452 మంది
మెదక్ మున్సిపాలిటీ - 606 మంది
నిజాంపేట - 257 మంది
పాపన్నపేట - 918 మంది
రామాయంపేట మండలం - 323 మంది
రామాయంపేట మున్సిపాలిటీ - 142 మంది
శంకరంపేట (ఆర్) - 632 మంది
నార్సింగి మండలంలోని నాలుగు గ్రామాలు - 86 మంది.

రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగ రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చేర్యాలలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన డీఏఓ



చేర్యాల, నవంబర్ 17 (జనంసాక్షి): చేర్యాల పట్టణానికి జిల్లా వ్యవసాయ శాఖాధికారి (డీఏఓ) స్వరూపారాణి మంగళవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చేర్యాల పట్టణంలోని సరస్వతి, ముస్త్యాల గ్రామంలోని శ్రీనివాస, హనుమాన్ ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీలను అధిక ధరలకు విక్రయించవద్దని దుకాణదారులను హెచ్చరించారు. యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర్లు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ, వేరుశనగ పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. స్ప్రింక్లర్, డ్రిప్స్, మల్చింగ్ షీట్, పందిళ్లు, సోలార్ సిస్టమ్ మరియు విత్తనాలు కావలసిన రైతులు ఏఈఓ వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. డీఏఓ వెంట చేర్యాల మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండి అఫ్రోజ్ పాల్గొన్నారు.

కోహెడ మండలానికి
659 కొత్త చేయూత పింఛన్లు మంజూరు

- లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, నవంబర్ 17 (జనంసాక్షి):



కోహెడ మండలంలో కొత్తగా మంజూరైన 659 చేయూత పింఛన్లకు సంబంధించిన పత్రాలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం లక్ష్మీ గార్డెన్స్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏడు రకాల పింఛన్లకు అర్హులై ఇంకా పొందని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వృద్ధులకు త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పింఛనుదారుడు మరణిస్తే 15 రోజుల్లోనే భార్య పేరు మీద పింఛన్ బదిలీ చేసే విధానం తీసుకొచ్చామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణం పూర్తి చేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఈ నెల 19న జాబ్ మేళా...

గద్వాల నడిగడ్డ, నవంబర్ 17 (జనంసాక్షి); జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఐ.డి.ఓ.సి.లోని ఖీ-30/1లో ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీసీఐ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ అనంతరం గద్వాల, ఐజ, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాల్లోని అపోలో ఫార్మసీ, పుష్పల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, పీఎంకేవీవై సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అరేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో
సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

ఆత్మకూర్, నవంబర్ 17 (జనంసాక్షి):



ఆత్మకూర్ మండలం అరేపల్లి గ్రామంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై జయన్న తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్సై జయన్న విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ... ఈ రోజుల్లో సోషల్ మీడియా, ఆన్ లైన్ గేమ్స్, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.
గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్ కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి, నవంబర్ 17 (జనంసాక్షి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.
ఈ పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పథకం ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు.
గతంలో భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు బీమా అందుబాటులో ఉండగా, ప్రస్తుతం తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.12 వేల సహాయం, పంట నష్టపరిహారం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాలకు రుణాలు వంటి పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన పేదలకు
పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదలకు ఆర్థిక భరోసా



కోహీర్, నవంబర్ 17(జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని రాయిపల్లి (డి) గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు మంజూరైన పింఛన్ల పత్రాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షుడు నర్సింలు, మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు భీరన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి వనిత, పట్వారీ మంజుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు పింఛన్లు అందించడం ద్వారా ప్రతి నెలా ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత వారి జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. పెంటయ్య, అలెగ్జాండర్, మండల కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి రూ.29 లక్షల పరిహారం అందజేత

ఎమ్మెల్యే జీఎంఆర్ చొరవతో పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు



పటాన్చెరు, నవంబర్ 17 (జనంసాక్షి): పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి. దానయ్య పాశమైలారం పారిశ్రామికవాడలోని ల్యామ్‌టఫ్ పరిశ్రమలో పనిచేస్తూ అక్టోబర్ 5న గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరడంతో పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి రూ.29 లక్షల పరిహారం మంజూరు చేయించారు.
మంగళవారం పటాన్చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు పరిహారం చెక్కులను అందజేసి, అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం సంక్షేమ సంఘం నాయకులు భాస్కర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు,

వృద్ధులకు చేయూత పింఛన్ ఆసరా: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

రాజాపూర్, నవంబర్ 17 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాజాపూర్ మండల కేంద్రంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మండలంలోని 24 గ్రామపంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.





ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, చేతివృత్తుల వారికి పింఛన్లు ఆర్థికంగా అండగా నిలుస్తాయని అన్నారు. ముఖ్యంగా ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు చేయూత పింఛన్ ధైర్యాన్ని, భరోసాను కల్పిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో కమీషన్లు తీసుకున్నారంటూ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.

ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడమే తన బాధ్యత అని తెలిపారు. తాను మూడేళ్లలో చేసిన అభివృద్ధిపై, గతంలో పదేళ్లు అధికారంలో ఉన్నవారి పనితీరుపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్, విక్రమ్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో 387 మందికి చేయూత పింఛన్ పత్రాల పంపిణీ


లబ్ధిదారులకు స్వయంగా అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

సిర్గాపూర్, నవంబర్ 17 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల కేంద్రంలోని ఆర్.ఆర్. ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సిర్గాపూర్ మండలా నికి మంజూరైన 387 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పథకంలో భాగంగా ఈ పింఛన్లు మంజూ రయ్యాయి అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలు:

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ – గృహజ్యోతి, పేదలకు సన్నబియ్యం, రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా, ఇళ్లు లేని పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం, మహిళా సంఘాలకు రుణాలు, యువతకు ఉద్యోగ, నైపుణ్య అవకాశాలు, సిర్గాపూర్ మండలంలో రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇంకా ఎవరైనా అర్హులు పథకాలకు దూరంగా ఉంటే



వారిని గుర్తించి పథకాలు అందేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అండలమ్మ, మండల సర్పంచులు, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాతికేళ్ల పోలీస్ సేవకు పురస్కారం...

- **హెడ్ కానిస్టేబుల్ దస్తన్నకు రాష్ట్రస్థాయి గౌరవం**

గుండుమల్, నవంబర్ 17 (జనంసాక్షి): పోలీస్ శాఖలో 25 ఏళ్ల పాటు అంకితభావంతో విధులు నిర్వహించిన గుండుమల్ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ మాలెకాడి దస్తన్నకు అరుదైన గౌరవం దక్కింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆయన సేవలను గుర్తించిన పోలీస్ శాఖ సేవా పతకంతో సత్కరించింది. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావంతో రెండున్నర దశాబ్దాలుగా అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ స్వాతి లక్రా చేతుల మీదుగా దస్తన్న సేవా పతకాన్ని అందుకున్నారు. 25 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ సేవకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించడం పట్ల సహచరులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. గుండుమల్ గ్రామానికి చెందిన వ్యక్తికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



నేషనల్, స్టేట్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి): ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) నేషనల్ కౌన్సిల్, టీయూడబ్ల్యూజే-హెచ్143 స్టేట్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ తెలిపారు. ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా నాగర్‌కర్నూల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కె.ఎస్. సురేష్ ఎన్నికయ్యారు. టీయూడబ్ల్యూజే-హెచ్143 స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా నాగ శేషయ్య (కొల్లాపూర్), హెచ్. ఉమాశంకర్ (అచ్చంపేట), మహమ్మద్ రవూఫ్ (నాగర్‌కర్నూల్) ఎన్నికైనట్లు పేర్కొన్నారు. జిల్లాకు ప్రాధాన్యత కల్పించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి నూతన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, బుచ్చయ్యకు ధన్యవాదాలు తెలిపారు.



టీయూడబ్ల్యూజే -హెచ్ 143

స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా ఉమాశంకర్

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 17(జనంసాక్షి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఉమా శంకర్ హౌదేకార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా అవకాశం కల్పించిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్-హెచ్ 143 రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, బుచ్చయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా ఖాన్‌లకు ఉమా శంకర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



నిరుపేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన చేయూత పింఛన్ల పథకంలో భాగంగా వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులకు పింఛన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు కూడా పత్రాలు అందజేశారు.





ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులను గుర్తించి పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయూత పింఛన్ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారని వెల్లడించారు.

ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మకుండా అభివృద్ధి కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని కోరారు. నియోజకవర్గంలో ఏ నిరుపేద ఆకలితో బాధపడినా తన బాధ్యతగా భావించి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కాంగ్రెస్ నాయకులు కొండా నాగేష్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం ఆగదు!

- **ఎన్‌పీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి?**
- **ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ జహీరాబాద్ బ్రాంచ్ 34వ సర్వసభ్య సమావేశం**

కోహిర్, నవంబర్ 17 (జనంసాక్షి): ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) జహీరాబాద్ బ్రాంచ్ యూనిట్ 34వ సర్వసభ్య సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ టి. శ్రీనివాసు, అధ్యక్షుడు బి. అశోక్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ కామ్రేడ్ డీఎస్. రఘు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీఎస్. రఘు మాట్లాడుతూ 1996 నోటిఫికేషన్ ద్వారా 2012-13 బ్యాచ్‌లో ఎల్ఐసీలో చేరిన ఉద్యోగులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

అలాగే 1996 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 2012-13 బ్యాచ్ ఉద్యోగులతో పాటు తాత్కాలిక పద్ధతిలో రిక్రూట్ అయిన ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని, తరగతి-3, తరగతి-4 ఉద్యోగుల నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల సవరణలను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి



కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ సమర్పించిన నివేదికలో జహీరాబాద్ బ్రాంచ్‌లో 15 మంది తరగతి-3 ఉద్యోగులు ఉండగా, వారందరూ 100 శాతం ఐసీఈయూ సభ్యులుగా కొనసాగడం గర్వకారణమని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

సమావేశంలో నూతన ఎల్ఐసీ యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.అశోక్, ఉపాధ్యక్షుడిగా చంటి, సెక్రటరీగా టి. శ్రీనివాసు, జాయింట్ సెక్రటరీలుగా శరత్ చంద్ర, అర్చన, ట్రెజరర్‌గా బి. అశోక్‌తో పాటు మోహన్, సాయి వాణి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎల్ఐసీ సిబ్బంది అభినందించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కామ్రేడ్స్‌తో పాటు వివిధ బ్రాంచ్‌ల యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలానగర్ మండలంలో

658 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ!

37 గ్రామ పంచాయతీల లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేత!

బాలానగర్, నవంబర్ 17 (జనంసాక్షి): బాలానగర్ మండలంలో అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పింఛన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం బాలానగర్ మండల కేంద్రంలో నిర్వహించారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో ఎంపికైన 658 మంది లబ్ధిదారులకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఎన్నాళ్లుగానో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందడంతో వారిలో హర్షం వ్యక్తమైంది.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నాలుగున్నర్ ఏండ్ల పాటు మంత్రిగా పనిచేసినప్పటికీ నియోజకవర్గానికి అవసరమైన నిధులు తీసుకురావడం, అభివృద్ధి పనులు చేపట్టడంపై తగిన శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి రియల్ ఎస్టేట్ వ్యాపారానికే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి హెచ్ఎండీఏ నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పెద్దాయపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా, నవోదయ పాఠశాల మంజూరుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా 2024 ఎన్నికలకు ముందు బాలానగర్-గంగాపూర్ రహదారి మంజూరైందంటూ ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లు అడిగారని, ఆ హామీతో ప్రజలను మోసం చేశారని గత పాలకులపై విమర్శలు చేశారు.



ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, 37 గ్రామ పంచాయతీలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్య రహిత భారతదేశమే మన లక్ష్యం

నషా ముక్త్ భారత్ అభియాన్

నారాయణపేట జిల్లా బ్యూరో నవంబర్ 17(జనంసాక్షి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ పోస్ట్ ర్‌నుగొరవ జిల్లా కలెక్టర్,రెడ్ క్రాస్ జిల్లా అధ్య క్షులు ప్రియాంక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసై టీ చైర్మన్ హరినారాయణ బట్వాద, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు సుధర్షన్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జయచంద్ర మోహన్ పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవ స్థకు, సమాజ అభివృద్ధికి కూడా తీవ్ర నష్టం కలిగి స్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాలు మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుష్ప్ర భావాలపై విద్యార్థులు, యువత ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

తాడిపర్తిలో ఆధ్యాత్మిక వైభవం..

అంగరంగ వైభవంగా శ్రీ రాధాకృష్ణ ఆలయ ప్రారంభోత్సవం

- **ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

గోపాల్‌పేట, నవంబర్ 17 (జనంసాక్షి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాధా కృష్ణ దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. గ్రామంలో నూతనంగా శ్రీ రాధాకృష్ణ దేవాలయ నిర్మాణం చేపట్టి ప్రారంభోత్సవం నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ నంద గోపాల యాదవ సంఘం సభ్యులు, మాజీ ఎంపీటీసీ నక్క కృష్ణయ్య, అడ్డాకుల శంకరయ్య, గ్రామ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ రామచంద్రయ్య, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు ఉందేకోటి రాజు, నాగరాజు, కృష్ణయ్య, కందూరు చంద్రయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: మర్రి జనార్దన్ రెడ్డి

- **ప్రచారం కాదు.. ప్రజలకు ఫలితాలు కావాలి**

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి):

ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, ఇప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు.



మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, తులం బంగారం, రూ.లక్ష ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగతా హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు పరిమితం చేశారని, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, పంటలకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ హామీని నెరవేర్చాలని అన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ హామీలను అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమంపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, తులం బంగారం హామీలను కూడా అర్హులకు అందించాలని సూచించారు.

నాగర్‌కర్నూల్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు. ప్రభుత్వం ప్రచారానికి పరిమితం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని మర్రి జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.

డయల్ యువర్ ఎస్పీకి విశేష స్పందన... ఎస్పీ డాక్టర్ వినీత్

- **24 ఫోన్ కాల్స్‌కు స్పందించిన ఎస్పీ డాక్టర్ వినీత్**

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి):

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని సత్వర పరిష్కారం చూపడమే డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఫోన్ ద్వారా తమ సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు తెలియజేశారు. మొత్తం 24 ఫోన్ కాల్స్ వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లో యువత మద్యానికి బానిసవుతున్నారని, బెల్ట్ షాపులను నియంత్రించి మూసివేయాలని పలువురు కోరారు. వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు వాహనాల ద్వారా మద్యం తరలిస్తున్నారని, అర్ధరాత్రి వరకు యువకులు బయట తిరుగుతున్నారని ఫిర్యాదు చేశారు.

రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. నారాయణపేటలో క్రాకర్స్ దుకాణాలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసే విధానాన్ని కొనసాగించాలని, అంబేద్కర్ చౌరస్తాలో ఆటో స్టాండ్ ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఇండోర్‌తో పాటు అవుట్‌డోర్ ఫిజికల్ కోచింగ్ అందించాలని విజ్ఞప్తి చేశారు. భూ వివాదాలు, సైబర్ నేరాల్లో డబ్బులు కోల్పోయిన బాధితులు కూడా తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.



ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా నమోదు చేసుకొని సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేశారు. వెంటనే విచారణ చేపట్టి చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యానికి తావులేదని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, డీసీఆర్‌బీ ఎస్ఐ బాలరాజు, కమ్యూనికేషన్ ఎస్ఐ పవన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికుల డిమాండ్

ఆత్మకూర్, నవంబర్ 17 (జనంసాక్షి): ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రంలోని ఎం.వి.రామన్ స్కూల్ నుంచి సంత బజార్ వరకు ఉన్న రహదారి దుమ్ము, ధూళితో ప్రజలకు నరకం చూపిస్తోంది. ఈ రహదారి ప్రస్తుతం మట్టి రోడ్డుగా ఉండటంతో ప్రతిరోజూ పాఠశాల బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి.వాహనాలు వెళ్లే సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేవడంతో ఇళ్లలోకి, దుకాణాల్లోకి ధూళి చేరుతోందని, దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ రహదారి వెంట నివాసముంటున్న చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, పాఠశాల విద్యార్థులు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు.



మున్సిపల్ అధికారులు స్పందించాలి:

ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎం.వి.రామన్ స్కూల్ నుంచి సంత బజార్ వరకు వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ను కోరుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు కనీసం ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపై నీటిని పిచికారీ చేసి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలు నిత్యం ఉపయోగించే ప్రధాన మార్గమైనప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యపై మున్సిపల్ పాలకవర్గం స్పందించకపోతే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని కాలనీవాసులు అన్నారు,

మెదక్‌లో మెగా జాబ్ మేళా

కొల్చారం, నవంబర్ 17(జనంసాక్షి):
విప్రో, కాగ్నిజెంట్, పీస్కాన్, అపోలో తదితర ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో ఉద్యోగాల భర్తీ. ఈ నెల 19న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహణ మెదక్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళా) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఉమాదేవి తెలిపారు.
ఈ జాబ్ మేళాలో విప్రో, కాగ్నిజెంట్, పీస్కాన్, అపోలో తదితర ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొని డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి.
ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం...
మెదక్ పరిసర ప్రాంతాల డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19న గురువారం ఉదయం 9 గంటలకు స్టేడియం వద్ద ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళా)లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
తీసుకురావాల్సిన ధ్రువపత్రాలు:
పదో తరగతి మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, డిగ్రీ పూర్తి చేసిన సర్టిఫికెట్లు
మెదక్ పరిసర గ్రామాల నిరుద్యోగ డిగ్రీ అభ్యర్థులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

మంజూరు పత్రాలు అందజేత



పాపన్నపేట, నవంబర్ 17 (జనంసాక్షి):
పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. మంగళవారం పాపన్నపేట లోని ఓ వేడుక మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్,డిఎల్ పిఓ యాదయ్య,కిసాన్ సెల్ జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,సర్పంచులు పావని,రాణెమ్మ,పంచాయతీ కార్యదర్శులు నయీమ్,ప్రవీణ్,ఇసాక్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు

కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలి

తూప్రాన్ పిఎసిఎస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి



తూప్రాన్, నవంబర్ 17(జనంసాక్షి): కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దని తూప్రాన్ పి ఎస్ సి ఎస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి తెలిపారు.
తూప్రాన్ ఉమ్మడి మండల ఫ్యాక్స్ సొసైటీ చైర్మన్ ఉమన్నగారి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్ మున్సిపల్ అయ్యప్ప దేవస్థానం పరిధిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేత మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ రావు ధర్మేందర్, శశి భూషణ్ రెడ్డి, గడ్డి వెంకటేశ్ యాదవ్, దోమలపల్లి కృష్ణ, సర్పంచులు, ఫ్యాక్స్ డైరెక్టర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు .

గోపాల్‌పేట, ఏదుల మండలాల్లో 786 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి



గోపాల్‌పేట, నవంబర్ 17 (జనంసాక్షి): అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం గోపాల్‌పేటలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో గోపాల్‌పేట, ఏదుల మండలాల నూతన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎమ్మెల్యే పెన్షన్ మంజూరు పత్రాలు, స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గోపాల్‌పేట మండలంలో 527 మందికి, ఏదుల మండలంలో 259 మందికి కలిపి మొత్తం 786 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో సుమారు 38 వేల మందికి ప్రతినెలా రూ.11 కోట్ల పెన్షన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభమవుతుందని, కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా కల్పిస్తుందని వివరించారు.
కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... గోపాల్‌పేట, ఏదుల మండలాల్లో ఇప్పటికే సుమారు 8 వేల మంది పెన్షన్లు పొందుతుండగా, తాజాగా మరో 786 మందికి మంజూరు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 70 వేల మందికి ప్రతినెలా రూ.17 కోట్ల పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు.
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి అర్హులు గ్రామపంచాయతీల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- **లోపాలకు తావులేకుండా తుది ఓటరు జాబితా రూపొందించాలి**
- **ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలు**



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 17 (జనంసాక్షి): ఎలాంటి తప్పులు, లోపాలకు తావులేకుండా పారదర్శకంగా తుది ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరం నుంచి ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో వీడియో సమావేశం నిర్వహించిన కలెక్టర్ ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ద్వంద్వ ఓటర్లకు సంబంధించి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినందున క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలన్నారు. గణన పత్రాలు సమర్పించిన వారి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులుగా గుర్తించిన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.
పెండింగ్‌లో ఉన్న ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో విచారించి అర్హతను నిర్ధారించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అనర్హులుగా గుర్తించిన ప్రతి కేసుకు సంబంధించిన ఆధారాలు, పత్రాలతో ప్రత్యేక దస్త్రాలను నిర్వహించాలని స్పష్టం చేశారు.
అలాగే ఫొటో మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీత, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సీడీపీఓ ఆకస్మిక తనిఖీలు

- **రికార్డులు, పౌష్టికాహార సరుకుల పంపిణీ పరిశీలన**



కోహీర్, నవంబర్ 17 (జనంసాక్షి): కోహీర్ మండలంలోని చింతల్‌గట్టు, కవేలి గ్రామాల అంగన్వాడీ కేంద్రాలను సీడీపీఓ సుశీల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పాలు, గుడ్లు, బియ్యం, పప్పు తదితర పౌష్టికాహార సరుకుల నిల్వలు, పంపిణీ తీరును పరిశీలించారు. రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు.
చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, కేంద్రాల నిర్వహణలో నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది పనితీరును పరిశీలించిన ఆమె, టీచర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గ్రేసి, తులసి, అంగన్వాడీ టీచర్లు అక్కమహాదేవి, జయశీల తదితరులు పాల్గొన్నారు.

కారు.. ద్విచక్ర వాహనం ఢీ..



పాపన్నపేట, నవంబర్ 17 (జనంసాక్షి): కారు ద్విచక్ర వాహనం ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన యూసుఫ్ పేట శివారులోని గ్రామీణ బ్యాంక్ సమీపన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. కుర్తివాడ గ్రామానికి చెందిన సార యేసు (45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికులు వెంటనే పోలీసులకు, కుటింబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కాగా మృతుడికి భార్య సుమతి తో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సీఎం సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్, సిరిసిల్ల, వేములవాడ, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పాదయాత్ర ప్రారంభమయ్యే ముస్తాబాద్ చౌరస్తాను కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాల్ తో కలిసి పరిశీలించారు.

అర్హులకు అండగా చేయూత

పింఛన్లు ఇచ్చిన ప్రజా ప్రభుత్వం


సర్పంచ్ బైర మానస రాజేందర్



బెజ్జంకి,నవంబర్ 17,(జనంసాక్షి): మండలంలోని దాచారం గ్రామ పంచాయతీ పరిధిలోని అర్హులైన గీత కార్మికులు,ఒంటరి మహిళలు,వితంతువులు,దివ్యాంగులకు సర్పంచ్ బైర మానస రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆసరా(చేయూత)నూతన పింఛన్ల మంజూరు పత్రాలను అందించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ,రైతు భరోసా వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోంది అనీ అన్నారు.
ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంతో పాటు గ్రామ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీటి బాల్ నర్సు,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి చేద్రయ్య, గ్రామ పెద్దలు,కాంగ్రెస్ నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు అందించడమే లక్ష్యం

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి
కీసర సర్కిల్ పరిధిలో 2,500 మందికి నూతన పెన్షన్లు మంజూరు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17 (జనంసాక్షి)

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించి, వారి జీవితాల్లో భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కీసర సర్కిల్ పరిధిలో నూతనంగా మంజూరైన 2,500 చేయూత పెన్షన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని దమ్మాయిగూడలోని సాయి భవాని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పట్నం మహేందర్ రెడ్డి లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు ఉత్తర్వులను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. పింఛన్లు పొందుతున్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం అండగా ఉంటుందని, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



2,500 మందికి పెన్షన్ ఉత్తర్వుల పంపిణీ

కీసర సర్కిల్ పరిధిలో నూతనంగా 2,500 మందికి చేయూత పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, డైరెక్టర్ ఈగ శ్వేత రాజ్ ముదిరాజ్, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షుడు ముప్పా రామారావు, జవహర్ నగర్, చంద్రపురి కాలనీ, కీసర డివిజన్ల అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, రామిడి స్వప్న విజయ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన అల్కాపూర్ టౌన్‌షిప్

అయ్యప్ప పాటలు, భజనలు, స్వాముల ఆటపాటలతో వైభవంగా ఐదో మహా పడిపూజ



రాజేంద్రనగర్, నవంబర్17(జనంసాక్షి) : మణికొండ డివిజన్ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఐడియల్ బిల్డర్స్ సురేష్ స్వామి ఆధ్వర్యంలో ఐదో మహా పడిపూజ కార్యక్రమం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేశవ గురుస్వామి, గంగపుత్ర నరసింహారావు స్వామి, తిరుపతి రావు ప్రసాద్ గురుస్వాముల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ, కుమారస్వామి పూజ నిర్వహించి, అనంతరం అయ్యప్ప స్వామికి విశేష అభిషేకాలు, రుద్రాభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, దీపారాధన, హారతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుస్వాముల మంత్రోచ్చారణలు, అయ్యప్ప నామస్మరణతో అల్కాపూర్ టౌన్‌షిప్ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అనంతరం అయ్యప్ప భజనలు, భక్తిగీతాలు, పాటలతో స్వాములు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అయ్యప్ప పాటలకు స్వాములు ఉత్సాహంగా ఆటపాటలతో సందడి చేస్తూ మహా పడిపూజ కార్యక్రమాన్ని మరింత వైభవంగా, విజయవంతంగా నిర్వహించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ భక్తి కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భిక్ష స్వీకరించారు.ఈ పూజా కార్యక్రమానికి స్థిరాస్తి వ్యాపారులు, పార్టీలకతీతంగా నాయకులు పాల్గొన్నారు.





పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా

కీసర, నవంబర్ 17 (జనంసాక్షి) అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించి, వారి జీవితాల్లో భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా అన్నారు. మంగళవారం కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ లో నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరైన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

మణికొండకు నార్సింగ్ సర్కిల్ కార్యాలయం తరలించడంపై కాంగ్రెస్ నాయకుల హర్షం



రాజేంద్రనగర్, నవంబర్17(జనంసాక్షి) : నార్సింగి సర్కిల్ కార్యాలయాన్ని మణికొండకు తరలించడంపై మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ హయాంలో నిర్మించిన భవనం నేడు ప్రజా పరిపాలనకు ఉపయోగపడటం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు జితేందర్ మెరుగు, కిరణ్ కుమార్ లు ఆధ్వర్యంలో నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డిని కలిసి రెండు డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు, రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, ప్యాచ్‌వర్క్, ప్రతిపాదిత లింక్ రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, ముత్యాలు, తాజ్ , సావిత్రి, ఇందిర, కస్తూరి శ్రవణ్, మహేందర్, అఖిల్, శరత్, షానవాజ్, షేక్ హాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

రాజేంద్రనగర్, నవంబర్17(జనంసాక్షి) : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను బుధవారం18న పంపిణీ చేయనున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

ఖరీదైన మద్యం సీసాల్లో చీప్ లిక్కర్.. ఇద్దరి అరెస్ట్

శంషాబాద్,నవంబర్17(జనంసాక్షి) : ఖరీదైన మద్యం బ్రాండ్ల ఖాళీ సీసాల్లో చీప్ లిక్కర్ నింపి అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు వంగలి అశోక్ (43), మహ్మద్ యాకూబ్ (29) నుంచి 10 కల్తీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకోగా, నిందితులపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్
- ఘనంగా ఎపిరాక్ ఎంప్లాయీస్ యూనియన్ 17వ వార్షికోత్సవం
- 7వ వేతన ఒప్పందం సాధనకు సిద్ధం కావాలి
- యూనియన్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ మణికంఠ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17 (జనంసాక్షి) కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కార్మికులంతా ఒకే జెండా కింద ఐక్యంగా నిలవాలని, హక్కుల సాధనలో రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లి పారిశ్రామిక వాడలోని ఎపిరాక్ ఎంప్లాయీస్ యూనియన్ 17వ వార్షికోత్సవ వేడుకలను సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. రాంబాబు అధ్యక్షతన జరిగిన సీఐటీయూ యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి, ఎపిరాక్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గత 16 ఏళ్లుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులంతా ఐక్యంగా పోరాడుతూ అనేక హక్కులను సాధించుకున్నారని తెలిపారు.





కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే ఐక్యతే ప్రధాన బలమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తూ కార్మికుల ప్రయోజనాలను విస్మరిస్తోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య ఉద్యమాలతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

7వ వేతన ఒప్పందం కోసం సిద్ధం కావాలి : కె.ఎస్.ఎస్.మణికంఠ

రానున్న 7వ వేతన ఒప్పందం సాధన కోసం కార్మికులంతా ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.మణికంఠ అన్నారు. యూనియన్ బలోపేతంతోపాటు కార్మికుల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఇందులో భాగంగా కొత్తగా తొమ్మిది మంది కార్మికులను పర్మినెంట్ సభ్యులుగా చేర్చుకున్నట్లు వెల్లడించారు.

వ్యవస్థాపకులకు సన్మానం

ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపకులు ఎం.భాస్కరరావు, బి.వి.సత్యనారాయణ, ఎండీ రఫీ, కోదండ రాముడు, డి.రమేష్, ఆర్.శ్రీనివాస్, బండారు శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మణికంఠ, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రాంబాబు, జాయింట్ సెక్రటరీ దుర్గాప్రసాద్, కోశాధికారి చీమల ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



క్రీడలతోనే ఐక్యత.. ఆత్మవిశ్వాసం

- లీడ్ ఇండియా భారత్ రత్నాస్ ప్రిన్సిపాల్ రాధారెడ్డి
- ఘనంగా సౌత్‌జోన్ జాతీయ క్రీడా పోటీలు ముగింపు



కీసర, నవంబర్ 17 (జనంసాక్షి)

క్రీడలు విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని లీడ్ ఇండియా భారత్ రత్నాస్ పాఠశాల ప్రిన్సిపాల్ రాధారెడ్డి అన్నారు. యువ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, నిరంతరం సాధన చేయాలని, పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.

కీసర మండలం రాంపల్లి ఎక్స్‌రోడ్ బండ్లగూడలోని లీడ్ ఇండియా భారత్ రత్నాస్ (ఎల్ఐబీఆర్ఏ) పాఠశాల ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన సౌత్‌జోన్ నేషనల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్--2026 పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో, యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆమోదంతో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విజేతలుగా డీపీఎస్ జట్లు

అండర్-14 విభాగంలో డీపీఎస్ మహేంద్ర హిల్స్ జట్టు విజేతగా నిలవగా, తెలంగాణ ఎల్ఐబీఆర్ఏ జట్టు రన్నరప్‌గా, మహారాష్ట్ర జట్టు ద్వితీయ రన్నరప్‌గా నిలిచాయి. అండర్--17 విభాగంలోనూ డీపీఎస్ మహేంద్ర హిల్స్ జట్టు విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నరప్‌గా, కర్ణాటక జట్టు ద్వితీయ రన్నరప్‌గా నిలిచాయి.

క్రీడాస్ఫూర్తికి నిదర్శనం

క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్ పోటీల్లో యువ క్రీడాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. క్రీడలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా స్నేహభావం, ఐక్యత, జట్టుకృషికి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ముగింపు వేడుకల్లో విజేత, రన్నరప్ జట్లకు అభినందనలు తెలిపి ప్రశంసించారు. పోటీల విజయవంతానికి సహకరించిన క్రీడాకారులు, పాఠశాలల యాజమాన్యాలు, కోచ్‌లు, క్రీడా అధికారులు, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆతిథ్యమిచ్చిన లీడ్ ఇండియా భారత్ రత్నాస్ పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

